సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం ; 7 ; మార్చి ; 2025



హలీమ్‌కు సలాం

రంజాన్ మాసంలో చేపట్టే వంటకాల్లో హలీం ప్రత్యేకతను సంతరించుకుంది. ఒకప్పుడు హైదరాబాద్‌లోనే దొరికేది. ఇప్పుడు ప్రధాన పట్టణాల్లోని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. - 8లో



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శని॥ (సా॥)	సహర్ ఆది॥ (ఉ॥)
రాయచోటి :	6.28	5.09
రాజంపేట :	6.27	5.15
పీలేరు :	6.28	5.06
మదనపల్లె :	6.30	5.18

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.110	రూ.130
రెండోరకం	రూ.80	రూ.100

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 67 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు మరో అవకాశం

రాయచోటి జగదాంబసెంటర్ : జిల్లాలోని బాలల సంరక్షణ కేంద్రాల రిజిస్ట్రేషన్‌కు ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు జిల్లా స్థాయి నోడల్ అధికారి, అదనపు జిల్లా పర్యవేక్షణాధికారి కె.రవిప్రకాష్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.జిల్లాలో బాలల న్యాయ చట్టం ప్రకారం పిల్లల రక్షణ, సంరక్షణ కోసం నడుపుతూఇప్పటిదాకా రిజిస్ట్రేషన్ చేసుకోని సంస్థలు ఈ నెల 10లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.మార్చి 10వ తేదీ తర్వాత కూడా రిజిస్ట్రేషన్ పొందకుండా బాలల సంరక్షణ కేంద్రాలు నడిపితే అటువంటి వ్యక్తులు, సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ఇంటర్ పరీక్షలకు 989 మంది గైర్హాజరు

రాయచోటి : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్ష గురువారం జిల్లా వ్యాప్తంగా 49 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించారు. 16278 మంది విద్యార్థులకు 15289 మంది హాజరయ్యారు. 989 మంది గైర్హాజరైనట్లు డీఐఈఓ కృష్ణయ్య తెలిపారు. రెగ్యులర్ పరీక్షల్లో 15018 మందికి 14203 మంది పరీక్షలకు హాజరు కాగా, ఒకేషనల్ పరీక్షలకు 1260 మంది విద్యార్థులకు 1086 మంది హాజరయ్యారు. పరీక్షల నిర్వహణలో లోటుపాట్లు లేకుండా విద్యార్థులకు తగిన మౌలిక వసతులను కూడా కల్పించామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ భూములను కాపాడటమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్

పీలేరు : ప్రభుత్వ భూములు కాపాడటమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి అన్నారు. గురువారం పీలేరు తహసీల్దార్ కార్యాలయాన్ని అకస్మికంగా తనిఖీ చేశారు. పీజీఆర్ఎస్, రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలపై గ్రామాల వారీగా రెవెన్యూ అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన వాటికి నాణ్యమైన పరిష్కార మార్గాలు చూపాలని అధికారులను ఆదేశించారు. పీజీఆర్ఎస్‌లో ఇంకా 80, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీల్లో 56 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వారం లోగా వీటిని పరిష్కరించాలని ఆదేశించారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పీలేరు మండలంలో పలు ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమైనట్లు గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకుంటామని, ఆక్రమించుకున్నవారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఆక్రమణలపై ఎవరి ఒత్తిడికి లోను కాకుండా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమాదేవి, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్ విజయవంతం చేద్దాం

మదనపల్లె : ఉమ్మడి చిత్తూరుజిల్లాలో ఈనెల 8వతేదీ శనివారం జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో కక్షిదారులు పాల్గొని కేసులను రాజీ చేసుకోవాలని జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్.భారతి పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహణపై మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి ఎం.ఎస్.భారతి మాట్లాడుతూ... కేంద్ర న్యాయసేవ అధికార సంస్థ, రాష్ట్ర న్యాయ అధికార సేవాసంస్థ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు చిత్తూరుజిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావ్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉమ్మడి చిత్తూరుజిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ జరుగుతుందన్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 32 బెంచ్‌లు ఏర్పాటుచేశామన్నారు. 1997 నుంచి జాతీయ లోక్‌అదాలత్ ద్వారా కేసులను రాజీచేయనున్నట్లు చెప్పారు. కోర్టుల్లో లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రతి మూడునెలలకు ఒకసారి లోక్ అదాలత్ నిర్వహించడం ద్వారా సుమారు 10 నుంచి 20శాతం కేసులు పరిష్కారమవుతున్నాయని తెలిపారు. రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల కక్షదారులకు సమయంతో పాటుగా ధనం ఆదా అవుతుందన్నారు. లోక్‌అదాలత్‌లో ఇచ్చిన తీర్పు అంతిమమని, దానిపై అప్పీల్ ఉండదన్నారు. శనివారం నిర్వహించే లోక్ అదాలత్‌లో న్యాయమూర్తులు, న్యాయవాదులు, రెవెన్యూ, పోలీస్, బ్యాంక్ అధికారులు, చిట్‌ఫండ్ కంపెనీలు, బీమా సంస్థల ప్రతినిధులు, కక్షిదారులు పాల్గొనాలని, ఎక్కువ కేసులు పరిష్కరించి చిత్తూరు జిల్లాను రాష్ట్రంలో మొదటిస్థానంలో ఉంచేందుకు సహకరించాలని కోరారు.

సాగునీటికి సంకటం !

- జిల్లాలోని ప్రాజెక్టులపై కూటమి సర్కార్ శీతకన్ను
- నిధుల కేటాయింపులు లేకపోవడంతో ఆయకట్టుకు అందని నీరు
- అన్నదాతల ఆందోళన





అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన దృశ్యం (ఫైల్)

సాక్షి రాయచోటి : సాగునీటి వనరులకు సంకటం ఏర్పడుతోంది. నీటి ప్రవాహంతో పచ్చగా కళకళలాడాల్సిన పంట పొలాలకు ఆపద ఏర్పడుతోంది. ఎప్పటికైనా మనకు అందుబాటులో ఉన్న ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నిర్మించుకోవడం...నిర్మాణంలో ఉన్న వాటిని పూర్తి చేసుకోవడంతోపాటు కొత్త ప్రాజెక్టులు చేపడితేనే ప్రతి ఎకరాకు సాగునీరు అందించేందుకు అవకాశం ఏర్పడుతుంది. వైఎస్సార్‌సీపీ సర్కార్ హయాంలో వెలిగల్లు ప్రాజెక్టు ద్వారా నియోజకవర్గంలోని పలు చెరువులను నీటితో నింపి పంట పొలాలు కళకళలాడేలా చేశారు. 2024లో సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి సర్కార్ అధికారంలోకి రావడంతో రైతులు ప్రాజెక్టులపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అయితే కొత్తవాటికి మోక్షం లేకపోగా, వరదలకు కొట్టుకుపోయిన ప్రాజెక్టులతోపాటు నిర్మాణాలు చివరిదశలో ఉన్నవాటికి కూడా బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో సాగునీటి రంగంపై నీలినీడలు అలుముకున్నాయి.

అన్నమయ్య ప్రాజెక్టుపై శీతకన్ను

అన్నమయ్య జిల్లాలో 2021 నవంబరులో వచ్చిన భారీ వర్షాలకు అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయింది. అన్నమయ్యతోపాటు పింఛా ప్రాజెక్టు కూడా కొట్టుకుపోవడంతో పరిసర గ్రామాలన్నీ తీవ్రంగా నష్టపోయాయి. అయితే తర్వాత వైఎస్ జగన్ సర్కార్ ప్రజలు కోలుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతోపాటు పింఛా ప్రాజెక్టుకు కూడా దాదాపు రూ. 82 కోట్లకు పైగా నిధులు కేటాయించి ప్రభుత్వం దిగిపోయే నాటికి 80 శాతం పైగా పనులు పూర్తి చేశారు. అంతేకాకుండా అన్నమయ్య ప్రాజెక్టు పనులకు సంబంధించి కూడా పెద్ద ఎత్తున ప్రాజెక్టు నిర్మాణానికి రూ. 370 కోట్లకు పైగా అంచనాలు రూపొందించారు. చెయ్యేరు నదికి అటు, ఇటువైపు రక్షణ గోడలతోపాటు ప్రాజెక్టు నిర్మాణాన్ని పెద్ద ఎత్తున చేపట్టేందుకు ముందుకు కదిలారు. ఆ దిశగా టెండర్లను కూడా పిలిచి పనులకు సిద్ధమవుతుండగా కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే టెండర్లను రద్దు చేసింది.ప్రస్తుతం అన్నమయ్య ప్రాజెక్టు గురించి పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవల అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్లో కూడా అన్నమయ్య ప్రాజెక్టు ప్రస్తావనే లేకపోవడంతో నిర్మాణం కాస్త కలగా మిగిలుతోందన్న ఆందోళన రాజంపేట ప్రాంత వాసులను వెంటాడుతోంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు 25 వేల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉన్న నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మించకపోతే ఆయకట్టు పరిస్థితి అగమ్యగోచరంగా మారనుంది.

చిన్న ప్రాజెక్టులనూ విస్మరించిన సర్కార్

జిల్లాలోని ప్రధాన సాగునీటి వనరైన వెలిగల్లు ప్రాజెక్టుకు సంబంధించి వివిధ పనులకు అంతంత మాత్రంగానే నిధులు కేటాయించిన సర్కార్ చిన్న ప్రాజెక్టులను విస్మరించింది. హంద్రీ–నీవాకు కొంత మేర నిధులు కేటాయించినా అదీ కూడా పెండింగ్ బిల్లుల నేపథ్యంలో నిధులు చాలని పరిస్థితి నెలకొంది. పింఛా ప్రాజెక్టుతోపాటు శ్రీనివాసపురం, ఝరికోన ప్రాజెక్టులకు సంబంధించి నిధుల మాట ఎత్తకపోవడంతో ఆయకట్టు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చివరి దశలో ఉన్న చిన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు నిధులు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఏది ఏమైనా ఈసారి సాగునీటికి పరిస్థితి చూస్తే సంకటంగా కనిపిస్తోంది.

అన్నమయ్య ప్రాజెక్టును విస్మరించారు



రాజంపేట పరిధిలోని అన్నమయ్య ప్రాజెక్టును ప్రభుత్వం పునర్నిర్మించాలి. కనీసం ప్రాజెక్టు ఊసెత్తకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. వేలాది ఎకరాల ఆయకట్టు కలిగిన ఈ ప్రాజెక్టుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం విస్మయం కలిగిస్తోంది. ప్రాజెక్టు నిర్మాణానికి సత్వర చర్యలు తీసుకోవాలి.

– మేడా రఘునాథరెడ్డి, రాజ్యసభ సభ్యులు

రైతులకు మేలు జరుగుతుంది



అన్నమయ్య ప్రాజెక్టు కింద 25 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ ప్రాజెక్టు నిర్మిస్తే నీటీ సాంద్రత పెరుగుతుంది. రైతులకు మేలు జరుగుతుంది. ఈ ప్రాజెక్టు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి టెండర్లను ఆహ్వానించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై 9 నెలలైంది. అన్నమయ్య ప్రాజెక్టు నిర్మిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయడం లేదు.

– ఆకేపాటి అమరనాథరెడ్డి, ఎమ్మెల్యే, రాజంపేట

అన్నమయ్య డ్యాం కట్టాలి



కొన్ని సంవత్సరాలుగా అన్నమయ్య డ్యాం నీళ్లతో సేద్యం చేసుకుంటూ వచ్చాం. ఇప్పుడు నీళ్ల లేక ఇబ్బంది పడుతున్నాం. బతికే దానికి కూడా ఏ ఆధారం లేదు. కష్టంగా ఉంది. డ్యాం కడితే నాలాంటి రైతులందరికి ఉపయోగపడుతుంది. మేమందరం మళ్లీ పైర్లు పెట్టుకుంటాం.

– కుంచపు లక్ష్మయ్య, రైతు, మందపల్లి వడ్డిపల్లి, రాజంపేట మండలం

మహిళాభివృద్ధికి కృషి చేద్దాం

ఓపెన్ హౌస్ ప్రారంభోత్సవంలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు



ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన విద్యార్థినులతో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : మహిళల భద్రత, రక్షణ,అభివృద్ధి, సాధికారతకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. ఈనెల 8న జరగనున్న అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా 1 నుంచి 8వ తేది వరకు మహిళా సాధికారత వారోత్సవాలను జిల్లా వ్యాప్తంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జరుపుతున్నట్లు ఎస్పీ తెలిపారు. అలాగే ఎస్పీ కార్యాలయాన్ని విద్యార్థినులు సందర్శించేలా, మహిళా గౌరవాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున జిల్లా కేంద్రంలో ర్యాలీని నిర్వహించనున్నట్లు ఎస్పీ తెలిపారు. వివిధ పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులను ర్యాలీ అనంతరం ప్రదానం చేస్తామన్నారు.

విద్యార్థునులతో మమేకమై.....

ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని తిలకించేందుకు వివిధ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థినులతో జిల్లా ఎస్పీ, పోలీసు అధికారులు మమేకమయ్యారు. విధి నిర్వహణలో పోలీసులు వినియోగిస్తున్న వివిధ రకాల అత్యాధునిక ఆయుధాల గురించి, బాంబ్ డిస్పోజల్స్ పరికరాలు, సాంకేతికత గురించి వివరించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎం వెంకటాద్రి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఐ రవిశంకర్ రెడ్డి, ఆర్‌ఐలు విజె రామకృష్ణ, ఎం పెద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల అందజేత



విద్యార్థికి సర్టిఫికెట్ ఇస్తున్న డీఈవో సుబ్రమణ్యం

గుర్రంకొండ : గుర్రంకొండ తెలుగు జెడ్పీహైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులకు డీఈవో సుబ్రమణ్యం ఎస్‌జీఎఫ్ జాతీయస్థాయి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. 2024–2025 సంవత్సరానికి స్థానిక తెలుగు హైస్కూల్లో తొమ్మిదో తరగతికి చెందిన ప్రసన్నకుమార్, మేకల సంతోష్ జమ్మూకాశ్మీర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో పాల్గొని రాష్ట్రానికి పతకాలు తీసుకొచ్చారు. ఈనేపథ్యంలో డీఈవో సుబ్రమణ్యం గురువారం విద్యార్థులను తన కార్యాలయానికి రప్పించుకొని సర్టిఫికెట్లను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన జిల్లాకు చెందిన విద్యార్థులు రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించడం శుభపరిణామన్నారు. క్రీడల్లో విద్యార్థుల ఉన్నతికి కారణమైన పీడీ రమేష్ బాబు, కోచ్ రవీంద్రలను డీఈవో అభినందించారు.

వైభవం..ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ : మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజైన గురువారం ఉదయం మూలవర్లకు స్నపన తిరుమంజనం జరిపారు. బ్రహ్మోత్సవాలు జరిగే పదిరోజుల పాటు ఆలయానికి, ఉత్సవాలకు, యజ్ఞయాగాలకు సంరక్షణగా ముక్కోటి దేవతలు ఉండాలని కోరుకొంటూ వారిని ఆహ్వానిస్తూ ధ్వజారోహణం నిర్వహించారు. ఈసందర్భంగా గరుత్మంతునికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. అనంతరం నైవేద్యంగా ఉంచిన ప్రసాదాలను సంతానం లేని మహిళలు స్వీకరిస్తే సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. తర్వాత ఊంజల్ సేవ జరిపారు. వాహన మండపంలో స్వామివారిని అందంగా అలంకరించి హంసవాహనంపై కొలువు దీర్చారు. గ్రామ పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

ఆలయంలో నేడు:

శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజైన శుక్రవారం ఉదయం ముత్యపుపందిరివాహనం, సాయంకాలం సింహవాహన సేవలు ఉంటాయని ఆలయ అర్చకులు గోపాలబట్టార్ తెలిపారు. ఇదే రోజు ఉదయం స్నపన తిరుమంజనం, ఊంజల్‌సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఒంటిమిట్టలో శాస్త్రోక్తంగా మహా సంప్రోక్షణ



పవిత్ర జలాలను యాగశాలకు తీసుకెళ్తున్న వేదపండితులు



ఉత్సవ మూర్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి దేవాలయంలో మహా సంప్రోక్షణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. గురువారం ఉదయం 7.30 గంటల నుంచి టీటీడీ పాంచరాత్ర ఆగమన సలహాదారు రాజేష్ కుమార్, వేదపండితులు భగవత్పుణ్యాహం, అగ్ని మదనం, ప్రధాన మూర్తి హోమాలు జరిపారు. సాయంత్రం 5.30 గంటల నుంచి చతుస్థానార్చనము, సహస్ర కలశాధివాసం, శాత్తుమొర నిర్వహించారు.

రామయ్య క్షేత్రానికి భక్తుల తాకిడి పెంచుతాం...

ఒంటిమిట్ట రామాలయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక నిపుణుల బృందంలోని రాముడు సతీ సమేతంగా బాలాలయంలోని మూలమూర్తులను దర్శించుకున్నారు. ఈయనతోపాటు స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, విజయవాడ నుంచి డైరెక్టర్ డాక్టర్ కొండా రమేష్, ప్రొఫెసర్లు డాక్టర్ దీపక్ కుమార్ సింగ్, అనీల్ కుమార్‌లు విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒంటిమిట్ట ఆలయానికి భక్తుల తాకిడి పెంచేలా, భక్తులు రామక్షేత్రంలో అడుగు పెట్టగానే భక్తి భావం కలిగేలా ప్రణాళికలు రూపొందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, సివిల్ విభాగం డీఈ నాగరాజు, ఏఈ అమర్నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రూటే.. సప‘రేటు’..!



కడపలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం

ఏ పనైనా సరే చేయాలంటే అందుకు నిబంధనలు ఉంటాయి. అయితే ఇక్కడ ప్రభుత్వ నిబంధనలకు తిలోదకాలిచ్చారు. ‘పరిపాలనకు’ పాతర వేశారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖకు ‘అవినీతి జాడ్యం’ పట్టుకుందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- వైద్య ఆరోగ్య శాఖలో ‘కాసుల వేట’
- ప్రతి పనికీ ఓ లెక్క
- నిబంధనలకు విరుద్ధంగా బదిలీ

సాక్షి టాస్క్‌ఫోర్స్ : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ శాఖలో తవ్వే కొద్దీ అవినీతి, అక్రమాలు బయటపడుతున్నాయి. ఇటీవల కాలంలో అవకతవకలపై విచారణలు జరుగుతున్నాయి. తాజాగా మరికొన్ని అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ శాఖలో పరిపాలన అదుపు తప్పిందనే వాదన ఉద్యోగుల నుంచి వినిపిస్తోంది. ఇందుకు సంబంధించిన కొన్ని ఉదాహరణలు..

‘బ్యాన్’ ఉన్న వేళ బదిలీ

ఉద్యోగుల బదిలీలకు సంబంధించి ప్రభుత్వం ‘బ్యాన్’ విధించింది. అంటే బ్యాన్‌ను తొలగించే వరకు ఎలాంటి బదిలీలు చేపట్టకూడదు. అయితే ఈ శాఖలో నిబంధనలు ధిక్కరించి బదిలీ చేయడం గమనార్హం. ఉమ్మడి జిల్లాకు సంబంధించి పుల్లంపేట పీహెచ్‌సీలో పని చేస్తున్న ఒక ఉద్యోగి ఆరు నెలలు మెడికల్ లీవ్ పెట్టారు. మెడికల్ లీవ్ అనంతరం ఆ ఉద్యోగికి రీపోస్టింగ్ ఇవ్వాలి. ప్రస్తుత జీఓ ప్రకారం తిరిగి పుల్లంపేటకే పోస్టింగ్ ఇవ్వాలి. అయితే అందుకు విరుద్ధంగా మాధవరం పీహెచ్‌సీకి పోస్టింగ్ ఇచ్చారు. అంటే ఆ ఉద్యోగిని పుల్లంపేట నుంచి మాధవరానికి బదిలీ చేశారు. ‘బ్యాన్’ ఉన్న సమయంలో ఈ బదిలీని ఏ ప్రాతిపదికన చేపట్టారో.. ఆ శాఖ వారికే ఎరుక. ఇందుకు గాను ఆ ఉద్యోగి నుంచి రూ.50 వేల నుంచి రూ. లక్ష వరకు లంచం తీసుకున్నట్లు సమాచారం. అలాగే ఆ ఉద్యోగి ఆరు నెలల మెడికల్ బిల్లు రూ.1,75,000 మంజూరు చేయడానికి మరో రూ.20 వేలు వసూలు చేసినట్లు తెలిసింది.

ఉద్యోగులు సతమతం

అలాగే సొంత శాఖలో జిల్లా వ్యాప్తంగా పని చేసే సిబ్బందిని కూడా వదలడం లేదు. డ్రాయింగ్ అండ్ డిస్‌పర్స్‌మెంట్ పరిధి కారణంగా 90 పీహెచ్‌సీలు వస్తాయి. మెడికల్ ఆఫీసర్ మొదలుకొని క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు సర్వీసుకు సంబంధించిన అంశాలు ఉంటాయి. ఇక్కడ కూడా చేతివాటం ప్రదర్శిస్తున్నారు. మెడికల్ లీవ్‌కు రూ 5.వేలు, ఎర్న్ లీవుకు రూ.3 వేలు, ఇంక్రిమెంట్ మంజూరుకు డాక్టర్‌కు అయితే రూ.3 వేలు, ఫీల్డ్ స్థాయి సిబ్బందికి రూ.2 వేలు, ఏదైనా దరఖాస్తును డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఫార్వర్డ్ చేయాలంటే రూ.5 వేలు, గర్భిణుల మెడికల్ బిల్లుకు రూ.5 వేలకు పైగా ఇలా ప్రతి పనికి ఒక రేటును ఫిక్స్ చేసి వసూలు చేస్తున్నారు. ఇందుకు కొంత మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ శాఖలో వేలాది మంది ఉద్యోగులు ఉన్నారు. ఏవైనా కార్యాలయ పనులు పడినప్పుడు అడిగినంత ఇచ్చుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. లేదంటే ఫైళ్లు ముందుకు కదలవు.. పనులు జరగవు. దీంతో ఈ శాఖలో పూర్తి స్థాయిలో ‘పరిపాలన’కు పాతర పడిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉద్యోగులు ఉద్యోగ భద్రతా కారణాల వల్ల తమ సమస్యలను బహిర్గతంగా చెప్పుకోలేరు. కారణాలు ఏవైనప్పటికీ సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ నిబంధనలు అమలయ్యేలా చూడాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

క్లుప్తంగా

ఆటో బోల్తా

మదనపల్లె : ఆటో బోల్తా పడి డ్రైవర్ గాయపడిన సంఘటన గురువారం కురబలకోట మండలంలో జరిగింది. ఎర్రమద్దివారిపల్లెకు చెందిన సుబ్బయ్య కుమారుడు రమేష్(26) సొంతంగా ఆటో నడపడమే కాకుండా స్థానికంగా ఓ మామిడి తోట వద్ద కాపలాగా ఉన్నాడు. గురువారం వ్యక్తిగత పనులపై ఆటోలో అంగళ్లకు బయలుదేరాడు. మార్గమధ్యంలో ఓ మలుపు వద్ద ఆటో వేగాన్ని అదుపుచేయలేకపోవడంతో బోల్తా పడింది. ప్రమాదంలో రమేష్ గాయపడగా, స్థానికులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదేవిధంగా ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఈ.శివరాం(45) భార్యతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా, ఎదురుగా మరో వ్యక్తి బుల్లెట్‌వాహనంలో వచ్చి ఢీకొన్నాడు. ప్రమాదంలో శివరాం గాయపడగా, స్థానికులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ప్రశాంత్


ఆర్యవైశ్య మహాసభ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడిగా నియామకపత్రం అందుకుంటున్న ఎల్లంపల్లి ప్రశాంత్

మదనపల్లె : ఆర్యవైశ్య మహాసభ అన్నమయ్యజిల్లా అధ్యక్షుడిగా మదనపల్లెకు చెందిన ఎల్లంపల్లి ప్రశాంత్ నియమితులయ్యారు. గురువారం ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షుడు టీజీ వెంకటేష్, ప్రశాంత్‌కు నియామక పత్రం అందజేశారు. ప్రశాంత్ మాట్లాడుతూ.. బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని, ఆర్యవైశ్య సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లా అధ్యక్ష పదవి ఎంపికకు తనకు సహకరించిన ఇల్లూరు లక్ష్మయ్య, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చిన్న రామసత్యనారాయణ, మువ్వల నరసింహులు శెట్టి, పలస వేణుగోపాల్, ఓం ప్రకాష్ తదితరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

హలీమ్‌కు సలాం

- రంజాన్ ప్రత్యేక వంటకంగా గుర్తింపు
- రుచికి ఫిదా అవుతున్న జనం



హలీంను కొనుగోలు చేస్తున్న ప్రజలు

రాజంపేట టౌన్ : రంజాన్ మాసంలో చేపట్టే వంటకాల్లో హలీం ఎంతో ప్రత్యేకతను సంతరించుకుంది. ఒకప్పుడు హైదరాబాద్‌లోనే దొరికే హలీం ఇప్పుడు ప్రధాన పట్టణాల్లోని ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. రంజాన్ మాసం సందర్భంగా ఉపవాసం ఉండే ముస్లీంలే కాక ఇతర మతాల వారు హలీం రుచిని ఎంతో ప్రీతిగా ఆస్వాదిస్తారు. అందువల్ల ఇప్పుడు సాయంత్రం ఆరు గంటలు అయితే చాలు అనేక మంది ప్రజలు హలీం విక్రయించే చోట వాలిపోతున్నారు.

హలీం అరబ్ దేశానికి చెందిన వంటకం

హలీం అరబ్ దేశానికి చెందిన వంటకమని ముస్లీంలు చెబుతున్నారు. ఆరో నిజాం నవాబు మహబూబ్ అలీఖాన్ హయాంలో అరబ్ దేశమైన పర్షియా నుంచి హలీం తెలుగు రాష్ట్రమైన హైదరాబాద్‌కు చేరుకొని ఎంతో ప్రసిద్ధిగాంచింది. మహబూబ్ అలీఖాన్ తన సంస్థానంలో పోలీసు వ్యవస్థను బలోపేతం చేసేందుకు కీలకమైన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి పర్షియా నుంచి ప్రత్యేక ఆహ్వానితులు వచ్చారు. ఆ సమయంలో రంజాన్ ఉపవాస దీక్షల్లో ఇఫ్తార్‌కు తయారు చేసే ప్రత్యేక వంటకమైన హలీం గురించి ప్రస్తావించారు. వెంటనే నవాబు తన సిబ్బందిని పిలిపించి హలీంను తయారు చేయించారు. ఆ విధంగా హలీం తొలుత హైదరాబాద్‌కు పరిచయమై ఇప్పుడు అన్ని పట్టణాలకు చేరుకుని ప్రజలతో లొట్టలేయిస్తోంది.

తయారీ కూడా ప్రత్యేకమే

సాంప్రదాయ వంటలతో పోలిస్తే హలీం తయారీ చాలా ప్రత్యేకమైనది. హలీం తయారీకి కనీసం తొమ్మిది గంటల సమయం పడుతుంది. ఇందులో మటన్ లేదా చికెన్, గోధుములు, అన్ని పప్పుదినుసులు, బాస్మతిబియ్యం, నెయ్యి, అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, యాలకలు, దాల్చిన చెక్క, మిరియాలు, కొత్తిమీర, నూనె, డ్రైఫ్రూట్స్ తదితర వస్తువులను వినియోగించి తయారు చేసి ఇఫ్తార్ సమయానికి సిద్ధం చేస్తారు. ఉపవాసం ముగించుకున్న ముస్లీంలతో పాటు ఇతర మతాలకు చెందిన వారు సైతం హలీంను ఆరగించేందుకు ఇష్టపడతారు. అక్కడే తినేవారికి పింగాణి కప్పులలో వేయిస్తుండగా పార్శిల్ తీసుకెళ్లే వారికి బాక్సులలో వేయిస్తున్నారు. ఒక్కో బాక్సు రూ.150, రూ.250, రూ.500కు విక్రయిస్తున్నారు.

రుచి అమోఘం



రంజాన్ మాసంలోనే దొరికే హలీం రుచి అమోఘంగా ఉంటుంది. పోషకాలు కలిగిన ఆహారం అయినందున ఉదయం నుంచి ఉపవాసం ఉండే ముస్లీంలు హలీంను తినడం వల్ల శక్తి పునరుత్తేజం అవుతుంది. ఇటు రుచి అటు పోషకాలు కలిగిన ఆహారం అయినందున మా కుటుంబంలో అందరు కూడా రంజాన్ మాసంలో హలీంను ఎక్కువ తింటాము.

షేక్ అబ్దుల్లా, రాజంపేట

శక్తివంతమైన ఆహారం



హలీం శక్తివంతమైన ఆహారం. మాసంతో పాటు అనేక రకాల పప్పుదినుసులతో తయారు చేయడం వల్ల ప్రొటీన్లు, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. చెక్క, లవంగాలు, ఉల్లిపాయలతో చేయడం వల్ల రోగనిరోధక శక్తిని కూడా పెంచుతుంది. రుచి బాగుండటంతో పాటు ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయని అతిగా తినడం అంతమంచిది కాదు. మితంగా తినాలి. అప్పుడే హలీం ఆరోగ్యానికి మేలు చేస్తుంది.

డాక్టర్ పాలనేని వెంకట నాగేశ్వరరాజు, సూపరింటెండెంట్, ప్రభుత్వ హాస్పిటల్, రాజంపేట

రంజాన్ వేళ.. రూపుదిద్దుకుంది ఇలా..!

చిన్నపాటి కార్డులో సహర్, ఇఫ్తార్ వేళలు తెలియజేసే పట్టిక


సహర్, ఇఫ్తార్ వేళలను తెలియజేసే పట్టిక

రాజంపేట టౌన్ : ముస్లింలు రంజాన్ మాసాన్ని అత్యంత పవిత్రంగా భావిస్తారు. ఈ మాసంలో ముస్లింలు నియమ, నిష్టలతో ఉపవాసాలు ఉంటారు. ఉపవాసం చేపట్టే, విరమించే సమయాన్ని విధిగా పాటిస్తారు. ఎందుకంటే సహర్, ఇఫ్తార్‌ల సమయం కంటే ముందుగాని, ఆలస్యంగా గాని ఉపవాసం చేపట్టడం, విరమించడం చేస్తే ఆ రోజు చేపట్టే ఉపవాస దీక్షకు సార్థకత ఉండదని ముస్లిం మతపెద్దలు చెబుతున్నారు. అందువల్ల సహర్, ఇఫ్తార్‌లు సరైన సమయంలోనే పూర్తి చేయాలి.

పూర్వం ఎలా చేసేవారంటే...

ప్రస్తుతం సహర్, ఇఫ్తార్‌లు ఏ సమయంలో చేపట్టాలో తెలియజేసేందుకు కాలపట్టిక అందుబాటులోకి వచ్చింది. అయితే ఈ కాలపట్టిక అందుబాటులోకి రాని సమయంలో సహర్, ఇఫ్తార్ వేళలను తెలియజేసేందుకు తూటాలు పేల్చేవారు. టపాసులు అందుబాటులోకి వచ్చాక టపాసులను పేల్చి తెలియజేసేవారు. కాలక్రమంలో మైకులు అందుబాటులోకి వచ్చాక మసీదుల్లో మౌజన్‌లు ఉపవాసం ప్రారంభానికి ఓ అరగంట ముందు రోజేదారో ఉఠో..ఉఠో (ఉపవాసం ఉండేవారు లేవండి) అంటూ నిద్రలేపేవారు. ఇక ఇఫ్తార్ సమయాన్ని అదే సమయంలో తెలియజేసేవారు. ప్రస్తుతం కాలం పూర్తిగా మారిపోయినందున సహర్, ఇఫ్తార్ వేళలను కార్డుల్లో ముద్రిస్తున్నారు. ఈ కార్డులను వ్యాపార సంస్థలు, ఆర్థిక పరిపుష్టి కలిగిన ముస్లింలు ముద్రించి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు.

సమయ నిర్ధారణ పట్టిక ఎలా తయారైందంటే..

పూర్వం ముస్లింలు ఉపవాసం ప్రారంభం, విరమణ సమయాల విషయంలో ఇబ్బందులు పడేవారు. ఈ ఇబ్బందులను గమనించిన ముఫ్తీ మహమ్మద్ రహీముద్దీన్ అబ్దుల్‌వాసే ఉపవాస ప్రారంభ, విరమణ సమయ నిర్ధారణ పట్టిక తయారు చేయాలని నిర్ణయించారు. అనుకున్నదే తడవుగా కొన్ని రోజులు శ్రమించి ముస్లింలు దీక్ష చేపట్టే సమయ పట్టికను 290 పేజీల పుస్తకం 'మియారుల్ ఔకాత్'లో పొందుపరిచారు. ఇప్పటికీ ఈ పుస్తకం ఆధారంగానే ఉపవాస సమయ పట్టికను నిర్ధారిస్తున్నారు. ఈ పుస్తకం ఆధారంగా 1968వ సంవత్సరంలో తొలిసారిగా ఉపవాస సమయ పట్టికను తయారు చేశారు. ఎగువ ప్రాంతం నుంచి దిగువ ప్రాంతానికి వచ్చే సరికి సహర్, ఇఫ్తార్ వేళల్లో కొన్ని నిమిషాల తేడాతో సమయ పట్టిక రూపొందించారు. అందువల్ల ఒక పట్టణానికి, మరొక పట్టణానికి రెండు లేక మూడు నిమిషాల తేడాతో సహర్, ఇఫ్తార్‌లు ప్రారంభమవుతాయి. ఈ సమయ పట్టికకు ఉపవాస సమయ పట్టిక అని నామకరణం చేశారు. ఉపవాస సమయ పట్టిక తయారై దాదాపు 56 సంవత్సరాలకు పైగా అయింది.

ఇతరులను అడగాల్సిన అవసరం ఉండదు..



ఖచ్చితమైన సమయంలోనే సహర్, ఇఫ్తార్‌లు పూర్తి చేయాలి. అందువల్ల నా చిన్నవయస్సులో ఒకరోజు ముందు సహర్, ఇఫ్తార్ వేళలు చెప్పేవారు. మసీదుకు వెళ్లని వారు ఇతరులను అడిగి తెలుసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గత కొన్నేళ్లుగా సహర్, ఇఫ్తార్ వేళలు తెలియజేసే పట్టికను కార్డుల్లో ముద్రించి ఇస్తున్నారు. అందువల్ల చాలా సౌకర్యవంతంగా ఉంది.

– అబ్దుల్ మునాఫ్, ఉస్మాన్ నగర్, రాజంపేట

వసతి గృహం వార్డెన్‌పై ఫుడ్ కమిషన్ చైర్మన్‌కు ఫిర్యాదు


కలికిరి సాంఘిక సంక్షేమశాఖ హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డి

కలికిరి : కలికిరిలోని సాంఘిక సంక్షేమ శాఖ ఇంటిగ్రేటెడ్ వసతి గృహ వార్డెన్ రవీంద్రపై విద్యార్థులు, కొందరు తల్లిదండ్రులు కలికిరికి విచ్చేసిన రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ్ ప్రతాప్ రెడ్డిని స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం ఉదయం హాస్టల్‌కు చేరుకున్న ఆయన హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న మెనూపై విచారించారు. విద్యార్థులు పొంతన లేకుండా సమాధానాలు చెప్పడంతో విద్యార్థులను అబద్ధాలకు తర్ఫీదు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమచేత రూములు క్లీన్ చేయించడం, పాత్రలు కడిగించడం, ఇతర పనులు చేయిస్తున్నారని, పలువురు విద్యార్థులు విన్నవించారు. దీంతో వెంటనే సాంఘిక సంక్షేమశాఖ డీడీతో మాట్లాడిన ఆయన వార్డెన్‌కు వెంటనే మెమో ఇవ్వాలని, వారం రోజులలోపు మరో వార్డెన్‌ను నియమించి, విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం స్థానిక ఏపీ ఎంజేపీ బాలికల గురుకుల రెసిడెన్షియల్ పాఠశాలను తనిఖీ చేసిన ఆయన విద్యార్థినులకు అందుతున్న సదుపాయాలు, మెనూపై విచారించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఎస్ఓ రఘురాం, ఎంఈఓలు కరీముల్లా, నాగార్జున, సీఎస్ డీటీ విజయ్‌కుమార్ రెడ్డి, తూనికలు, కొలతల అధికారి నాగరాజ తదితరులు ఆయన వెంట పాల్గొన్నారు.

విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలి

పీలేరు : ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు విద్యతోపాటు నాణ్యమైన భోజనం అందించాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాప్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని కామాటంపల్లె, ప్రకాశం రోడ్డు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనంతరం జెడ్పీ బాలికోన్నత పాఠశాలను తనిఖీ చేసి ఇస్కాన్ ద్వారా సరఫరా అయిన భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం చిత్తూరు మార్గంలోని జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల, తిరుపతి రోడ్డులోని ఏపీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు చదువుతోపాటు ఆరోగ్యం చాలా ముఖ్యమని, అందుకు తగ్గట్లు ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఓ రఘురాం, తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, సీఎస్ డీటీ విజయ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల నాటు బాంబులకు పాడి ఆవు బలి


నాటుబాంబులు నమిలి పాడిఆవు నోరు పేలిపోయిన దృశ్యం

గుర్రంకొండ : అడవి జంతువులను వేటాడేందుకు పొలాల గట్లపై వేటగాళ్లు ఏర్పాటు చేసిన నాటు బాంబులను పొరబాటున పాడిఆవు నమలడంతో నోరుమొత్తం పేలిపోయి చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది. ఈ సంఘటన గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ మామిళ్లవారిపల్లెలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి..

గ్రామానికి చెందిన నాగరాజ, రేవతి దంపతులు పాడి ఆవులను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నారు. గురువారం గ్రామానికి సమీపంలోని బండకింద గుట్టవైపు ఉన్న పొలాల వైపు నాగరాజు తమ పా డిఆవులను మేతకు తీసుకెళ్లాడు. గుట్టకిందనే పొలాలు ఉండడంతో గ్రామానికి చెందిన కొంతమంది వేటగాళ్లు అడవి జంతువులను వేటాడడం కోసం అక్కడక్కడా నాటుబాంబులు అమర్చారు. ఈ నేపథ్యంలో పొలాల గట్లపై గడ్డి మేస్తున్న పాడిఆవుల వద్ద పెద్ద శబ్దం రావడంతో నాగరాజు దంపతులు పరుగున అటువైపు వెళ్లారు. అప్పటికే వేటగాళ్లు అమర్చిన నాటుబాంబు నమిలి పాడిఆవు నోరు మొత్తం పేలిపోయి రక్తపుమడుగులో పడిపోయింది. సమాచారం అందుకున్న స్థానిక పశువైద్యాధికారి సునీల్ నాయక్ పాడి ఆవుకు వైద్యసేవలు అందించారు. పాడి ఆవు జీవించడం కష్టమని చెప్పారు. దీంతో జీవనోపాధి కోల్పోయిన పాడిరైతు దంపతులు బోరున విలపించడం అందరిని కలచివేసింది. ఈ సంఘటనకు గ్రామానికి చెందిన వేటగాళ్లు రెడ్డెప్ప, బాబు కారణమని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పాడి రైతు దంపతులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రమశిక్షణతో విధులు నిర్వహించాలి

ప్రొబేషనరీ మహిళా ఎస్ఐలకు జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచన


ఎస్పీతో ప్రొబేషనరీ మహిళా ఎస్ఐలు

రాయచోటి : విధి నిర్వహణలో నిర్భయంగా, నిష్పక్షపాతంగా, క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీతనం పాటిస్తూ బాధితులకు న్యాయం చేసి ముద్దాయిలకు శిక్షలు పడేలా పనిచేయాలని ప్రొబేషనరీ మహిళా ఎస్ఐలకు ఎస్పీ విద్యాసాగర్ నాయుడు సూచించారు. అనంతపురం పోలీసు శిక్షణ కళాశాలలో శిక్షణ పూర్తి చేసుకున్న అనంతరం అన్నమయ్య జిల్లాకు కేటాయించిన నలుగురు మహిళా ప్రొబేషనరీ ఎస్ఐలు గురువారం జిల్లా కార్యాలయంలో జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. నూతనంగా పోలీస్ శాఖలోకి అడుగుపెడుతున్న ప్రొబేషనరీ ఎస్ఐలకు ఎస్పీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజలకు మంచి సేవలు అందిస్తూ పోలీస్ శాఖ ప్రతిష్టను మరింత పెంచేలా విధులను నిర్వర్తించాలని సూచించారు. విధి నిర్వహణలో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని ఉత్తమ ఫలితాలను రాబట్టాలన్నారు. అలాగే ప్రజలకు మరింత సేవ చేసేలాగా చూడాలన్నారు. ఫిర్యాదుదారులతో సత్ ప్రవర్తనతో ప్రవర్తించాలని తెలిపారు. పీజీఆర్ఎస్ ఫిర్యాదులను అప్‌లోడ్ చేసే విధానం, ఎఫ్ఐఆర్, దర్యాప్తుకు సంబంధించిన రికార్డులను రాయడం నేర్చుకోవాలన్నారు. విధి నిర్వహణలో ఎక్కడా ఏ విధమైన అనుమానం వచ్చినా వెంటనే సీనియర్ అధికారులను అడిగి తెలుసుకొని నివృత్తి చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

మహిళా ఎస్ఐలు వీరే..

ప్రొబేషనరీ మహిళా ఎస్ఐలు దొంతుల తేజశ్విని, బానోతు శ్రీప్రియ, చిత్తూరు సుస్మిత, పోకల హారిక ఉన్నారు.

రికార్డులు సంతృప్తికరంగా లేవు

- డీఎల్‌పీఓ నాగరాజు
- నిధుల దుర్వినియోగంపై కొనసాగుతున్న విచారణ

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పోతుపేట గ్రామ పంచాయతీలో చేయని అభివృద్ధి పనులతో పాటు ఇష్టారాజ్యంగా రూ.లక్షల ప్రజాధనం దుర్వినియోగంపై జనవరి 24న సాక్షి పత్రికలో 'నిధులు నీళ్లపాలు' అని కథనం వెలువడింది. ఈ నేపథ్యంలో మండలంలో కొత్తగా ఏర్పడిన పోతుపేట గ్రామ పంచాయతీకి మంజూరైన నిధులు, ఏ పనికి ఎంత ఖర్చు పెట్టారో ప్రజా క్షేత్రంలో బహిర్గతం చేయాలని పోతుపేటకు చెందిన ఎస్సీ నాయకుడు కేవీ రమణ ప్రజా ఫిర్యాదుల దినంలో భాగంగా గత నెల 24న జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. సమగ్రమైన విచారణ జరపాలని డీపీఓ మస్తాన్ వలీని కలెక్టర్ ఆదేశించారు. ఈ తరుణంలో గత కొద్ది రోజులుగా డీపీఓ ఆదేశాల మేరకు మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజు, ఇన్‌చార్జి మండల ఈఓఆర్డీ మోహన్ ప్రతాప్‌లు గ్రామ పంచాయతీకి సంబంధించిన నిధులు, ఖర్చుల వివరాలతో కూడుకున్న రికార్డులను తనిఖీ చేస్తున్నారు. ఖర్చు చేసిన రూ.22 లక్షల నిధులకు సంబంధించి పలు అనుమానిత రికార్డులను పరిశీలించి విస్తుపోయినట్లు సమాచారం. రెజ్యులేషన్, క్యాష్, ఎంబుక్‌లు, వార్డు సభ్యుల తీర్మానాలు, వాటి ఆమోద పత్రాలు లేకపోవడాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. అనంతరం రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎల్‌పీఓ విలేకరులతో మాట్లాడుతూ రికార్డులు సంతృప్తికరంగా లేవు. రికార్డుల తనిఖీ ఇంకా కొనసాగుతోంది, క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో ప్రజల సమక్షంలో విచారిస్తాం. జరిగిన కొన్ని పనులకు సంబంధించి విజిలెన్స్ కమిటీకి అప్పగించి సమగ్రమైన తుది నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసిన కేవీ రమణ మాట్లాడుతూ ఎలాంటి మీటింగ్‌కు వెళ్లని తమ బంధువులైన వార్డు సభ్యుల సంతకాలు కూడా ఫోర్జరీ చేశారని, పనులకు తగ్గ ఎంబుక్‌లు కూడా లేవని, నిధుల దుర్వినియోగానికి బాధ్యులైన అధికారులకు వత్తాసు పలికినా, అధికార పార్టీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి రికార్డులు తారుమారు చేసినా తాను న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తానని స్పష్టం చేశారు.

ఆర్టీపీపీలో కాంట్రాక్టు కార్మికుడి మృతి

మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని కార్మికుల ధర్నా


మృతి చెందిన ఆర్టీపీపీ కాంట్రాక్ట్ కార్మికుడు నాగరాజు

ఎర్రగుంట్ల : డాక్టర్ ఎంవీఆర్ రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు శనగలగూడూరు నాగరాజు(48) విధి నిర్వహణలో మృతి చెందాడు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మృతదేహంతో కార్మికులు ధర్నా చేపట్టారు.

స్థానికులు తెలిపిన వివరాల మేరకు..అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం రాగితోటపాలెం గ్రామానికి చెందిన నాగరాజు 2011లో ఆర్టీపీపీలో కాంట్రాక్ట్ కార్మికుడుగా చేరారు. అప్పటి నుంచి ప్రతి రోజు స్వగ్రామం నుంచి ఆర్టీపీపీకి వచ్చి విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆర్టీపీపీలోని సీహెచ్‌పీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతనికి భార్య నిర్మలతో పాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రోజు మాదిరిగానే గురువారం కూడా డ్యూటీకి వచ్చాడు. మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత డ్యూటీలో ఉండగానే ఫిట్స్ రావడంతో అక్కడే ఉన్న తోటి కార్మికులు ప్రాజెక్టు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు నిర్ధారించారు. ఆర్టీపీపీ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా కార్మికుడు మృతి చెందాడంటూ మృతుడి కుటుంబ సభ్యులతో కలసి మృతదేహంతో ధర్నా చేపట్టారు. దీంతో ఆర్టీపీపీ యాజమాన్యం కార్మిక సంఘాల నాయకులతో చర్చించింది. మృతుడి కుటుంబానికి రూ.4 లక్షల నష్టపరిహారంతో పాటు మృతుడి కుటుంబానికి ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. దీంతో ధర్నా విరమించారు.

తండ్రిపై కొడుకు బండరాయితో దాడి

సిద్దవటం : కన్న తండ్రిపైనే కొడుకు బండరాయితో దాడి చేయడంతో తండ్రి ఖాదర్ హుస్సేన్ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం మేరకు.. సిద్దవటం మండలం ఉప్పరపల్లె గ్రామానికి చెందిన ఖాదర్‌హుస్సేన్ తన సొంత గృహాన్ని అద్దెకు ఇచ్చేందుకు బోర్డును ఏర్పాటు చేశాడు. అతని కుమారుడు బాబా ఫకృద్దీన్ ఆ బోర్డును తొలగించి తండ్రిపై బుధవారం సాయంత్రం ఇంటి వద్ద ఉన్న బండరాయితో తలపై కొట్టడంతో తీవ్ర గాయాలతో కుప్ప కూలిపోయాడు. స్థానికులు, బంధువులు ఖాదర్‌హుసేన్‌ను ఒంటిమిట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ ఆస్తి కోసం కన్న తండ్రిపైనే కొడుకు దాడి చేయడం అన్యాయమన్నారు. సిద్దవటం ఇన్‌చార్జి ఎస్ఐ శివప్రసాద్ జరిగిన ఘటనపై విచారిస్తున్నట్లు తెలిపారు.


కన్నకొడుకు చేతిలో గాయపడిన ఖాదర్‌హుస్సేన్

వ్యాపారిని కారు ఢీకొన్న ఘటనపై కేసు నమోదు


ప్రమాద స్థలంలో పోలీసులకు దొరికిన కారు విడిభాగం

నిమ్మనపల్లె : నిర్లక్ష్యంగా వేగంగా కారు నడిపి ఎదురుగా ద్విచక్ర వాహనంలో వస్తున్న పానీపూరి వ్యాపారి శ్రీనివాసులు అతని భార్య లలితను ఢీకొన్న ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. బుధవారం రాత్రి నిమ్మనపల్లి– మదనపల్లె మార్గంలో, రెడ్డివారిపల్లి పంచాయతీ పిట్టావాండ్లపల్లె వద్ద, సోమల మండలం తమ్మినాయన పల్లి పంచాయతీ కురువపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాసులు, మదనపల్లి పట్టణంలోని ఈశ్వరమ్మ కాలనీ పెట్రోల్ బంక్ వద్ద పానీపూరి వ్యాపారం చేస్తూ జీవిస్తున్నాడు. వ్యవసాయ పనుల నిమిత్తం భార్య లలితతో కలిసి స్వగ్రామానికి వెళ్లి తిరిగి సాయంత్రం ద్విచక్ర వాహనంలో మదనపల్లెకు వస్తున్నారు. అదే సమయంలో మదనపల్లె వైపు నుంచి వచ్చిన గుర్తు తెలియని కారును డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ శ్రీనివాసులు ద్విచక్ర వాహనాన్ని ఢీకొని అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడిని భార్య లలిత, బంధువు రమేష్ సాయంతో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

భార్యపై భర్త మచ్చుకత్తితో దాడి

చాపాడు : అనుమానం పెనుభూతమై కట్టుకున్న భర్త భార్యను కడతేర్చేందుకు మచ్చుకత్తితో విచక్షణా రహితంగా దాడి చేసిన ఘటన మండలంలోని నక్కలదిన్నె పంచాయతీ కొట్టాల గ్రామంలో గురువారం మధ్యాహ్నం జరిగింది. మండల పరిధిలోని కొట్టాల(బీసీ కాలనీ) గ్రామంలో గురువారం మధ్యాహ్నం ఎర్రిబోయిన భాస్కర్(48) అనే వ్యక్తి తన భార్య కళావతి(40)పై మచ్చుకత్తితో దాడి చేసి విచక్షణారహితంగా నరికాడు. ఈ ఘటనలో కళావతి తల, చేతులు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు బాధితురాలిని 108లో ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.